# మొద్దుగుట్ట అమరులు

# మృత్యుంజయులు



**అమరుల బంధుమిత్రుల సంఘం ప్రచురణ**

# మొద్దుగుట్ట అమరులు మృత్యుంజయులు

ఏబీఎంఎస్ ప్రచురణ

ప్రచురణ కాలం : జూలై, 2016
వెల : 20/-

ప్రతులకు :
కొడకంచి నర్సన్న
మచ్చబొల్లారం,
అల్వాల్, సికింద్రాబాదు.

ముద్రణ :
చరిత ఇంప్రెషన్స్,
ఆజామాబాద్, హైదరాబాద్.

# 'తిరిగి తిరిగొచ్చిన మళ్లీ తిరిగొచ్చిన' తమకు మరణమే లేదన్న అమరులు శృతి, సాగర్‌లు

- వివి

ఆమె ఇంట్లో విశాఖపట్నం వెళ్లినపుడు సముద్ర తీరంలో ఆమె కట్టుకున్న పిట్టగూళ్ల ఫొటో చూసాను. ఆమె తన అక్క స్వాతి పసిపాప కోసం చేసిన బొమ్మలు చూసాను. కలలు, ఊహలు సృజించే ఒక మానవిగా ఆమెనందులో పోల్చుకున్నాను.

ఎన్‌టిఆర్ కాలంలోనే ప్రకటించి, తర్వాత రోజుల్లో మండలానికి ఒకటి ఏమొచ్చె, మందీ మార్బలం మనీ, రాజకీయ ప్రాబల్యం ఉన్న ప్రతి ఒక్కరూ ఇంజినీరింగ్ కాలేజి ప్రారంభించారు. ఎక్కడికక్కడ నదుల్లో, కాలువల్లో, వాగుల్లో, వంకల్లో ఇసుకంతా తోడేస్తున్న కాలంలో సివిల్ ఇంజినీర్లు, ఖనిజాలన్నీ కంపెనీల వాళ్లు తరలించుకుపోతున్న కాలంలో మైనింగ్ ఇంజినీర్లు, వేళ్లు కంప్యూటర్ మీద ఆడడం నేర్చిన దగ్గర్నించి మన సమాచారం శత్రువుకివ్వడానికి తయారు చేస్తున్న ఐటి ఇంజినీర్లు, యాంత్రిక జీవితాల రచన కోసం మెకానికల్ ఇంజినీర్లు.

ఆమె చిన్నప్పటి నుంచీ ఇంజినీరేనని ఆ పిట్టగూళ్లల్లో, ఆ పిల్లల బొమ్మల్లో తెలుస్తూనే ఉన్నది. అవన్నీ సమాజంలోని భావితరానికి నిజమయ్యే కలలు కావాలని ఆమె సోషల్ ఇంజినీరు కావాలనుకున్నది. పొరుగున ఉన్న గోదావరిలో కూడ ఇసుక మిగలని మాఫియాల మాయాజాలం నుంచి దూరంగా సముద్రతీరంలో ఇసుక వెతుక్కున్నట్లుగా, మొక్క, ఆకు, పువ్వు స్వచ్ఛంగా, స్వేచ్ఛగా బతకలేని వ్యవస్థ నుంచి ఆమె స్వేచ్ఛకు దారులు వేస్తున్న అడవి బాట ఎంచుకున్నది.

ఆమె ఒక విప్లవ వాతావరణంలో వ్యక్తీకరణను ఆలకించిన శృతిగా కళ్లు తెరిచింది. యుక్త వయసురాలు కాగానే విప్లవ స్వరమే కాదు ఆచరణ కూడ అయింది.

విద్యావంతుల నుంచి విప్లవంలోకి వెళ్లడం లేదనుకుంటున్న సందర్భంలో ఆమె విప్లవంలోకి వెళ్లింది. మహిళలు – ఎవరి తోడుగానో తప్ప వెళ్లడం లేదనుకుంటున్న

కాలంలో యువ విద్యార్థుల కవాతులలో భాగంగా వెళ్లింది. అమెరికా వైపు చూస్తున్న విద్యార్థి యువతరమే కాదు అడవి వైపు చూస్తున్న విద్యార్థి యువతరం కూడా ఉంది సుమా అని శత్రువు ఉలిక్కిపడేట్లుగా వెళ్లింది. తెలంగాణ రూపాన్ని చూసి ఎందరో భ్రమిస్తున్న కాలంలో తెలంగాణ సారాన్ని – ప్రజాస్వామ్య సంస్కృతిని సాకారం చేయడానికి వెళ్లింది. తెలంగాణకే తిరిగివచ్చి అమరురాలయింది. ఆ గోదావరి తీరంలోనే, ఆ చరిత్రాత్మక మేడారంలోనే. అందుకే ఆమెను తెలంగాణ పోరాట వారసత్వంలో భాగంగా సమ్మక్కగా స్మరించుకుంటున్నారు. స్వీయ గౌరవ రాజకీయాలకు, ప్రత్యామ్నాయ రాజకీయాలకు ప్రజాస్వామిక రాజకీయాలకు ప్రతీక అయి నిలిచింది ఇవ్వాళ శృతి. బతుకు కోసం ప్రాణమిచ్చిన బతుకమ్మగా పాడుకున్నారు ప్రజలామెను. బంగారు బతుకమ్మలు కాదు బడుగువర్గాల బతుకమ్మ వలె హృదయాల్లో నిలుపుకున్నారామెను. అయితే ఆమె అంత మాత్రమే కాదు. ఆమె మానవి మాత్రమే కాదు. ఆమె విప్లవం. అందుకే ప్రజలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని, మార్చ్ 8ని, 2016లో ప్రపంచమంతా శ్రామికవర్గ మహిళా పోరాట దినోత్సవంగా శృతి స్మృతిలో జరుపుకున్నారు. శృతి విప్లవ సారంగా రూపొంది మన మధ్య ఇపుడు ఒక స్మృతిగా సజీవంగా ఉన్నది.

'పుడితె ఒకటి, చస్తె ఒకటి' అన్నట్లుగా తమ పుట్టుకలను, చావులను సార్థకం చేసుకున్న యువతీ యువకులు శ్రుతి, సాగర్‌లు. మానవ జీవిత సాఫల్యానికి కాగడాలుగా వెలిగిన క్షణాలు వాళ్లు. రణాలు వాళ్లు. వాళ్లు పుట్టిన వాళ్లు. అమరులై మనలోకి తిరిగి వచ్చిన వాళ్లు. ఎందుకంటే వాళ్లు చావలేదు. చంపబడినారు.

ఎగసిపడే కెరటం, విరిగిపోయి మళ్లీ గాలికి వెనక్కి నెట్టబడి మళ్లీ తిరిగి రాకుండా విరిచేసిన శరీరావయవాల వలె కాదు, పోటెత్తే శక్తిని, తుఫానులు సృష్టించే శక్తిని కూడదీసుకొని విద్యాసాగర్ మన మధ్యకు వచ్చాడు. ఏడాది కూడ నిండీ నిండకుండానే తన జ్ఞాపకాల్లో గుండె పగిలిపోయిన తల్లి – తన సంతానం కోసం కనే కలలను, తన కలలను జోడు చేసుకొని ఇద్దరి సున్నిత భావాల బలంతో మన మధ్యకు వచ్చాడు. ఒక కొండను ఎగబాకే చీమ వలె ఆయన ఎన్నోసార్లు పడి లేచాడు. తీరానికి తోసుకొచ్చి విరిగిపడిన కెరటం వెనక్కుపోయి మరింత బలాన్ని చేకూర్చుకొని వచ్చి తీరాన్ని ముంచెత్తుతూ విరిగిపడినట్లు ఆయన తన కలల కోసం అంత యవ్వన జీవితాన్ని ఎన్ని ప్రయోగాల కొలిమిలో కాల్చాడు. జమ్మి చెట్టు మీద దాచిపెట్టిన ఆయుధాలను మళ్లీ తీసుకోవడమంటారు. పాలపిట్టల కోసం, పజ్జన్న కంకుల కోసం మళ్లీ వెతుక్కోవడమంటారు. శత్రువు తుడిచేసిన దారులను మళ్లీ వేసుకోవడమంటారు.

బెగ్గం పాడయిన ఊళ్లను మళ్లీ పొందించడమంటారు. కోల్పోయిన మనిషిని వెతుక్కోవడమంటారు. విద్యాసాగర్ బడుల్లో, కళాశాలల్లో సమాచారంలో పోగొట్టుకున్న వివేకాన్ని విప్లవంలో వెతుక్కున్నాడు. ఊరు, వాడలుగా, కులాలుగా ఖండఖండాలయిన పల్లెల్ని ప్రత్యామ్నాయ రాజకీయాల్తో బతికించాలని చూసాడు.

మూడేళ్లు వెళ్లివచ్చి పోల్చుకున్నాడు. తానక్కడ చూసిన జనతన సర్కార్‌ను ఇక్కడ తన ఊళ్లో, ఉద్యమంలోని తెలంగాణలో, ఉద్యమ ఫలితంగా ఏర్పడిన తెలంగాణలో ప్రయోగించగలనేమో అని ప్రయాసపడ్డాడు. ప్రయత్నించాడు. ఊళ్లో నుంచి దారులు పట్టణాలకు, నగరాలకు, నగరాల నుంచి హైవేలు అడవిలోకి పెట్టుబడి హైనాల దాహాన్ని, ఆకలిని తీర్చడానికే కానీ, అవి దారులు కాదు, దాడులని గ్రహించాడు. ఎన్నటికైనా ఇంక అడవి నుంచి వాడలకు, వాడల నుంచి ఊళ్లకు దారులు వేసి, ఆ వెలుగు దారుల వెంట చీకట్లో వాడలలోకి, వాడల నుంచి ఊళ్లోకి గెరిల్లాలుగా ప్రవేశించి జనసైన్యంగా పట్టణాలకు చుట్టుముట్టాలని తీర్మానించుకున్నాడు.

తిరిగి వస్తున్నారు. పోతున్నారు. నిజానికి వాళ్లు ఎక్కడికీ పోలేదు. భౌగోళిక తెలంగాణలో భౌతికంగా వాళ్లు లేరేమో కానీ, ప్రభావంగా వాళ్లు ఎప్పుడూ ఉన్నారు. తెలంగాణ కోసమే అజ్ఞాతంలో ఉన్నారు. అడవిలో ఉన్నారు. సాయుధంగా ఉన్నారు. సమస్యల్లో ఉన్నారు. పరిష్కారాల్లో ఉన్నారు. ఎదురుగా ఉండే అపరిచితులకన్నా ఎక్కడో ఉన్న ఆత్మీయ పరిచయస్తులుగా ఎప్పుడూ మన మాటల్ని, చేతల్ని, ఆలోచనల్నీ కనిపెడుతూ ఉన్నారు.

చైతన్యానికి పదార్థం మూలమని చెప్పే మన శాస్త్రీయ విశ్వాసానికి అనుగుణంగా, విలువలకు ఆలంబన ఉద్యమం, ఉద్యమానికి అవసరం నిర్మాణం అని చెప్పే మన గతితార్కిక చారిత్రక అవగాహనకు అనుగుణంగా వాళ్లు ఏర్పడినారు. ఒక నిర్మాణంగా ఏర్పడినారు. తెలంగాణ ఏర్పడకముందే తెలంగాణ పేరు మీద తెలంగాణ కోసం ఏర్పడినారు. నిర్మాణంగానే తెలంగాణలోకి వచ్చే ప్రయత్నం చేసారు. తీరాలకి కెరటాల వలె. ఆ ప్రయత్నాల్లో పువ్వర్తి అమరులు మొదలు, కాటిపెల్లి అమరుల వరకు గోదావరి, ప్రాణహిత నదులను ఇటు ఖమ్మం నుంచి, అటు ఆదిలాబాద్ దాకా ఎరుపెక్కించిన వారి చరిత్రంతా తెలంగాణ చరిత్ర. ప్రజాస్వామిక తెలంగాణ చరిత్ర. గత రెండేళ్ల చరిత్రే.

సుధాకర్‌కు శోభన్‌కు మధ్యన, చిరకాల అనుభవం ఉన్న విప్లవ యోధుల అమరత్వ కాలానికి మధ్యన, తెలంగాణ ఏర్పడిన తర్వాత విప్లవంలోకి వెళ్లి మళ్లీ తెలంగాణ కోసం పనిచేస్తూ అమరులయిన చరిత్ర వివేక్, శృతి, సాగర్‌లది. పువ్వర్తి

ఆపరేషన్ వంటిదే బొట్టెం ఆపరేషన్, కాటిపెల్లి ప్రాణహిత తీర ఆపరేషన్.

వస్తూపోతూ నిర్మాణం చేస్తూ నిలదొక్కుకుంటున్న ప్రజాస్వామిక తెలంగాణ మీద నిఘా పెట్టి గోదావరిని అభయారణ్యాల నుంచి హరిత హారాల దాకా, ఓపెన్ కాస్టుల దాకా, గుట్టల విధ్వంసం దాకా, పోలవరం నుంచి కాళేశ్వరం దాకా ఏమొచ్చె, మల్లన్నసాగర్ దాకా ముంచేయాలని, నీళ్లను ముంచడం కాదు, నీళ్లను కంపెనీలకు తరలించడానికి ప్రజల్ని ముంచేయడానికి ఏర్పడిన ప్రభుత్వం ప్రవాహానికి విప్లవకారుల నెత్తుటితో ఆనకట్ట వేయాలని చూస్తున్నది. విప్లవకారులు ఆ ప్రయత్నాన్నే టాటూ నది వంతెనగా మార్చాలని ప్రాణాలు ఒడ్డి పోరాడుతున్నారు. ఇవ్వాల్టి దృశ్యమదే. ఇంద్రావతి, శబరి, ప్రాణహిత, గోదావరి నదుల వెంబడి ఒక గ్రేహౌండ్స్ – బూడిద రంగు తోడేళ్ల దాహంతో నిర్మాణమైన రాజ్యాంగ యంత్రపు ఆనకట్ట. లక్ష్యం – పత్రహరితాన్ని, ఆకుపచ్చదనాన్ని వేటాడే మెకనాస్ గోల్డ్ అన్వేషణ. ఈ లోపల ఇక్కడ సర్దుకునేవన్నీ సర్దుకోవాలి. తమ కోసం కాదు. దాట వేయడానికి, కంపెనీల ఖజానాలకు చేరవేయడానికి, సముద్ర మార్గాన, ఆకాశ మార్గాన, ఎక్స్‌ప్రెస్, స్లైవేస్ మార్గాన చేరవేయడానికి. ఇసుక కావచ్చు, రాయి కావచ్చు, ఏ ఖనిజమైనా కావచ్చు. ప్రభుత్వాలు దళారీలు. ప్రభుత్వాలు మాఫియాలు. దళారీలు ప్రభుత్వాలు. మాఫియాలు ప్రభుత్వాలు. దొర తిట్టు మాటయితే ముఖ్యమంత్రి గౌరవించే మాట అయిన చోట, పెత్తనాన్ని ప్రశ్నించిన నోటికి, ఎన్నికయిన అధికారం అడ్డుపడే మాటయినపుడు దోపిడీ పరాయివాడి నుంచి మన వాడికి మారడం అనేది పొరుగువానికి కాదు, విలాయితీకి దోచిపెట్టే కాలాన్ని ప్రశ్నించింది విప్లవం.

ఆ విధంగా ఏటూరునాగారం అడవుల్లో పోడు భూములు కాపాడుకోవడానికి, మైనింగ్ మాఫియా నుంచి ఖనిజాలు కాపాడుకోవడానికి, జల్ జంగల్ జమీన్‌లు మాత్రమే కాదు ఇజ్జత్ కాపాడుకోవడానికి పోరాడుతున్న ఆదివాసుల మధ్యకు అక్షరాల వచ్చి చేరారు శ్రుతి సాగర్‌లు. మళ్లీ మేడారం జాతరకు, మళ్లీ వరంగల్‌కు, మళ్లీ తెలంగాణకు – మన మధ్యకు. వాళ్లిప్పుడు అజ్ఞాతంలో లేరు. వాళ్లెక్కడో లేరు. మన మధ్య ఉన్నారు. మన హృదయాల్లో, మన గుండెల్లో జెండా అయి ఉన్నారు. ఇప్పుడామె భావార్థంలో శృతి. ఇప్పుడతడు భావార్థంలో సాగర్. ఆ విధంగా అమరత్వం అనేది అమృతత్వాన్నిస్తుంది.

ఈ స్మృతి ముగిస్తూ అలవాటుగా తేదీ వేయాలనుకున్నప్పుడు గుర్తొచ్చింది. ఈరోజే కదా, ఇప్పటికి నలభై ఆరేళ్ల క్రితం సత్యం, కైలాసాలు ఇటువంటి బూటకపు ఎన్‌కౌంటర్‌లోనే అమరులయ్యారు. కొండబారెడి మాస్టారుగా, గిరిజనుల హృదయంలో

నిలిచిన సత్యంగా, ప్రజలు పాడుకున్న వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసాలు అమరులు అయిన రోజు. జీవితమంతా ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుంచి వర్గ పోరాటం వైపు మరలుతూ, ఉపాధ్యాయులుగా పనిచేస్తూ పోరాట స్వభావం వల్ల గిరిజన ప్రాంతాలకు బదిలీ అయినప్పుడు దానినే కార్యక్షేత్రంగా చేసుకుని ఉజ్వలమైన శ్రీకాకుళ రైతాంగ పోరాటాన్ని నిర్మాణం చేసిన వాళ్లు. ఆ నాయకత్వం ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఎ. చదువుతూ విద్యార్థి సంఘం అధ్యక్షుడుగా ఎన్నికైన పంచాది కృష్ణమూర్తిని, ఆయన సహచరి నిర్మలను తమ కొడుకు విశ్వంను వదిలి విప్లవంలోకి వచ్చేంతగా ఉత్తేజపరిచింది.

మళ్లీ ఇంతకాలానికి అటువంటి నాయకత్వమే విద్యావంతులైన శృతి, సాగర్‌లను విప్లవ బాట పట్టించింది. తెలుగు నేల మీద ఇది గర్వించదగిన ఒక విప్లవ సంప్రదాయం. పోరాటంలో ఒరిగిపోతూ, ఒకరి చేతి నుంచి ఒకరు జెండా అందుకునే సంప్రదాయం. బొట్టెం (తోగు) అమరుల జీవిత చరిత్రలో సృజన గురించి కవిత రాస్తూ, చాలా మంది నువ్వు వివేక్ మీద, శృతి మీద స్మృతి గీతాలు రాసావు కదా, ఇప్పుడు నీ గురించి రాసే వంతు మాకు వచ్చిందా అని చాలా మంది బాధపడ్డట్లు ఈ నవ యవ్వనులే ఒకరు ఒరిగిపోతుంటే ఒకరు పోరాట జెండా అందుకుని ముందుకు సాగడం ఒక త్యాగ సంప్రదాయ నిదర్శనం. చారు మజుందార్ చెప్పిన 'త్యాగాల బలిదానాల కాలమింకా మనకీ పరీక్ష పెడుతూనే ఉంటుంది'.

జూలై 10, 2016

# కామ్రేడ్ మహిత (తంగెళ్ళ శృతి)

నూతన ప్రజాస్వామిక విప్లవ విజయంతోనే సాంఘిక,ఆర్థిక అసమానతలు తొలగి సమ సమాజం నిర్మాణమవుతుందని, అందులో భాగంగానే మహిళలకు విముక్తి లభిస్తుందని నమ్మి... దాన్ని అచరిస్తున్న క్రమంలోనే మొద్దుగుట్ట బూటకపు ఎదురు కాల్పులలో కా.మహిత అమరురాలైంది. కా. మహిత వరంగల్ జిల్లా హన్మకొండ మండలం వడ్డెపల్లిలో తంగెళ్ళ సుదర్శన్, రమాదేవిలకు రెండవ కూతురుగా ఫిబ్రవరి 2, 1991న జన్మించింది. కా. మహితకు ఒక అక్క ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. వడ్డెపల్లి స్పందన హైస్కూల్లో పదవ తరగతి వరకు చదువుకున్నది. తాళ్ళ పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో(సోమిడి) బి.టెక్. పూర్తి చేసింది. 2013లో హైదరాబాద్‌లో నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో ఎమ్.టెక్. చేస్తూ మధ్యలోనే విప్లవోద్యమంలోకి వచ్చింది.



తంగెళ్ళ సుదర్శన్ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తూ డి.టి.ఎఫ్., విరసంలలో సభ్యుడిగా ఉన్నాడు. కా.మహిత తల్లి రమాదేవి చైతన్య మహిళా సంఘంలో సభ్యురాలుగా పని చేస్తున్నది. కుటుంబంలో విప్లవ రాజకీయ వాతావరణం ఉండటంతో కా.మహిత చిన్నతనం నుండే విప్లవ సిద్ధాంతం, రాజకీయాల పట్ల అవగాహన పెంచుకున్నది. విరసం సభ్యుడైన తండ్రి సుదర్శన్‌తో కా.మహిత సమావేశాలకు, సాహిత్య వర్క్‌షాపులకు వెళ్ళేది. ఆ విధంగా సమాజంలోని వాస్తవిక పరిస్థితులను పరిశీలించడం అలవాటు చేసుకుంది. తల్లి రమాదేవితో పాటు కా.మహిత కూడా చై.మ.సం. కార్యకర్తగా ఎదుగుతూ వచ్చింది. కుటుంబంలో ఉన్నటువంటి ప్రజాస్వామిక సంబంధాలతో తన జీవితాన్ని మహిళల సమస్యల కోసం పని చేయటానికి ఉపయోగించుకున్నది. తను ఇంజనీరింగ్ చదువుతున్న రోజుల్లోనే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సకల జనుల సమ్మెలో, సాగరహారంలో పాల్గొని పాటలు పాడింది. సమావేశాలలో మాట్లాడింది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా 2014 జూలైలో పోలవరం నిర్వాసితుల కోసం ఆంధ్ర, ఒరిస్సా, చత్తీస్‌గఢ్ ఆదివాసులు నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్నది. కా.మహిత తండ్రిలాగానే పాటలు బాగా పాడుతుంది.

తన పాటల ద్వారా చైతన్య మహిళా సంఘానికి 2009లో తెలంగాణా ఉద్యమం ద్వారా పరిచయమైంది. బి.టెక్. పూర్తయిన తర్వాత తల్లి రమాదేవితో పాటు చై.మ.సం. కార్యక్రమాలలో చురుకుగా, చొరవతో పాల్గొంటూ వచ్చింది. 2012 నవంబరుకల్లా వరంగల్ జిల్లా కమిటీ సభ్యురాలు అయ్యింది. 2012లో జరిగిన 5వ రాష్ట్ర మహాసభల్లో మొదటిసారి మూడు రోజులు క్యాంపులో పాల్గొన్నది. మహాసభల్లో వలంటీరుగా పని చేసి మంచి కార్యకర్తగా తయారైంది. వరంగల్ జిల్లా నుండి పాటలు పాడింది. సభల తర్వాత సమీక్షలో స్పష్టంగా మాట్లాడి తన ప్రత్యేకతను, దృఢత్వాన్ని చాటుకుంది.

2014 సెప్టెంబర్ వరంగల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రంలో మహిళల ఆకాంక్షలు అనే అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సులో చాలా క్రియాశీలంగా పని చేసింది. 8 రోజుల క్యాంపుకు 16 మంది కార్యకర్తలతో కూడిన టీంకు బాధ్యతలు నిర్వహిస్తూ కాలేజీ, హాస్టళ్ళు, బస్తీలు, కార్యాలయాలలో అవగాహనను అందిస్తూ ప్రచారంలో భాగమైంది. కానిస్టేబుల్ రజనిపై ఆత్యాచారం, హత్య ఘటనపై నాటికను రాసింది. రజని తండ్రి పాత్రను పోషించింది. ఈ విధంగా శృతి తన బాధ్యతలను విస్తృతం చేస్తూ రాష్ట్ర కల్చరల్ టీం సభ్యురాలుగా ఎదిగింది. దోపిడీ వ్యవస్థను కూల్చకుండా మహిళలు, ఆదివాసులు, దళితులు, మైనారిటీలు, దోపిడీ అణచివేతలకు గురవుతున్న ప్రజలందరి మౌలిక సమస్యలు పరిష్కారం కావని, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, సోషలిజాన్ని అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో కొనసాగుతున్న విప్లవోద్యమంతోనే పరిష్కారం అవుతాయని నమ్మి తాను విప్లవోద్యమంలోకి రావటానికి నిర్ణయించుకున్నది.

కా.మహిత అక్టోబరు 2014లో తన ఎమ్.టెక్. చదువును మధ్యలోనే వదిలివేసి విప్లవోద్యమంలోకి వచ్చింది. ఇంతకు ముందు ఎన్నడూ తనకు పరిచయంలేని దళ జీవితంలోకి రావటంతో ఎదురయ్యే ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొంటూనే, క్రమంగా అలవాటు పడింది. రోజువారి దళానికి సంబంధించిన వంట, సెంట్రీ, బరువులు మోయడం, వ్యాయామం చేయటంలో వెనుకాడకుండా చురుకుగా పాల్గొన్నది. భర్తీ అయిన వెంటనే స్నైపర్ మిలిటరీ స్కిల్స్ నేర్చుకున్నది. దళంలో ఉపాధ్యాయురాలుగా పని చేసింది. తను ఉన్నత చదువు చదివాననే భావన ఏమాత్రం లేకుండా పార్టీ సాహిత్యాన్ని చదువుతూ తోటి కామ్రేడ్లకు తెలియని విషయాలు చెప్తూ అర్థం చేయించింది. తను విప్లవ సిద్ధాంతాన్ని, రాజకీయాలను అధ్యయనం చేస్తూ, వాటిని అచరణకు జోడించుకుంటూ, వర్గపోరాటాల జ్వాలలో తనను తాను జ్వలించుకుంటూ, మంచి కమ్యూనిస్టుగా ఎదగడానికి, తన అవగాహనను పెంచుకుంటూ అందుకు

అనుగుణంగా నూతన ప్రజాస్వామిక విప్లవ విజయంతోనే మహిళలకు విముక్తి లభిస్తుందని తెలంగాణ సమాచార బులిటెన్‌కు వ్యాసాన్ని రాసింది. 'శ్రామిక' కలం పేరుతో కవితలు రాసింది. పాటలు పాడుతూ పార్టీలో కూడా తను మంచి విప్లవ గాయకురాలిగా ఎదిగింది. కా.మహిత విప్లవోద్యమంలోకి రాకముందు తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, విద్యార్థి, మహిళా ఉద్యమాలలో కలిసి పాల్గొని ఒకేసారి విప్లవోద్యమంలోకి వచ్చిన కా.రఘు(వివేక్) లంకపల్లి ఎదురు కాల్పుల్లో కా.కమల,కా.సోనీలతోపాటు అమరుడయ్యాడు. అయినప్పటికీ కా.మహిత ఏమాత్రం అధైర్యపడలేదు. మరింత పట్టుదలతో ధైర్యంగా తన సమర్థతను పెంచుకోవటానికి కృషి చేసింది. కోయ భాషను నేర్చుకోవడానికి తీవ్రంగా ప్రయత్నం చేసింది.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడవ దశ దాడి, నిర్బంధం మధ్యన కా.మహిత ఏటూరునాగారం–మహాదేవపూర్ దళ సభ్యురాలుగా పని చేస్తున్న క్రమంలోనే వరంగల్ జిల్లాలో మొద్దుగుట్ట బూటకపు ఎదురు కాల్పులలో అమరురాలైంది. ఎన్‌కౌంటర్లు లేని తెలంగాణ తెస్తామన్న నియంత కె.సి.ఆర్., మావోయిస్టులు బలపడుతున్నారని ఖమ్మం నుండి ఆదిలాబాద్ వరకు గ్రేహౌండ్స్, పారామిలిటరీ బలగాలతో కూంబింగులు కొనసాగిస్తూ దళాలపై దాడులు, ప్రజలను చిత్రహింసలు పెట్టటం, అక్రమంగా అరెస్టులు చేసి జైళ్ళలో బంధించడం, సభలకు, సమావేశాలకు అనుమతులు ఇవ్వకుండా అరెస్టులు చేస్తున్నాయి. నిరంతరం కూంబింగులలో భాగంగా ముందస్తు సమాచారంతో సెప్టెంబర్ 15,2015న వరంగల్ జిల్లా మొద్దుగుట్ట ప్రాంతంలో వందలాది గ్రేహౌండ్స్ బలగాలను మోహరించి ఎటూరునాగారం–మహదేవపూర్ దళంపై దాడి చేశారు. ఆ దాడిలో కా.మహిత, కా.సాగర్(మునికంటి విద్యాసాగర్ రెడ్డి)లను పట్టుకొని క్రూరంగా చిత్రహింసలు పెట్టి హత్య చేశారు. కా.మహితపై అత్యాచారంచేసి మర్మావయవాలపై బయోనెట్‌తో గాయం చేసి తొడలు, కడుపు, నడుముల భాగాల్లో ఆసిడ్ పోసి, కుడి మోచేయిని విరిచి ఒళ్ళంత గాయపరిచి అత్యంత క్రూరంగా హత్య చేసి, ఎన్‌కౌంటర్ కథలు అల్లారు. దీంతో తెలంగాణ ప్రజలు ఒక్కసారిగా భగ్గుమన్నారు. తె.రా.స., కె.సి.ఆర్. ప్రభుత్వంపై విరుచుకు పడ్డారు. పది వామపక్ష పార్టీలు, 371 ప్రజా సంఘాలు, వేలాదిగా ప్రజలు తీవ్ర నిరసనలు తెలిపారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం కావడం చూసి కె.సి.ఆర్. ప్రభుత్వం ఉక్కిరి బిక్కిరైంది. కా.మహిత, కా.సాగర్‌ల బూటకపు ఎన్‌కౌంటర్ తెలంగాణ సమాజాన్ని ఒక్క తాటిపైకి తీసుకు వచ్చింది. కా.మహితను శత్రువు భౌతికంగా నిర్మూలించినా, తన ఆశయాలను నిజం చేస్తామని శపథం చేద్దాం.

కామ్రేడ్ మహితకు విప్లవ జోహార్లు.

# కామ్రేడ్ సాగర్(మునికంటి విద్యాసాగర్ రెడ్డి)

కా.సాగర్ పుట్టిన పెద్ద పెండ్యాల, దాని చుట్టు వున్న గ్రామాల ప్రజలకు మొన్నటి వరకు ఒక సాధారణ వ్యక్తిగా మాత్రమే తెలుసు. కానీ ఇప్పుడు వరంగల్ జిల్లా గోవిందరావుపేట మండలం అడవుల్లో మొద్దుగుట్ట ఎన్‌కౌంటర్‌లో కా.మహిత, కా.సాగర్‌ల అమరత్వం తరువాత అతనో విప్లవకారుడిగా ప్రజలకు సుపరిచితం. కా.మహిత, కా.సాగర్‌ల విప్లవ జీవితం, వారి అమరత్వం గురించి చర్చించుకోని వారు, స్మరించుకోని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. దేశ,రాష్ట్ర రాజకీయాలను వేడిక్కించి, పోరాట శక్తులన్నింటిని ఏకం చేసి, ఒకే వేదికపై నిలబెట్టి, పాలకులకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా, ముక్తకంఠంతో రాజ్యహింసను ప్రశ్నించడానికి నడిపించిన కా.మహిత, కా.సాగర్‌ల అమరత్వం ఎంతో గొప్పది. ఎంతో శక్తివంతమైనది. వీరి విప్లవ ప్రస్థానం అతి తక్కువ కాలమే అయినా వీరు ఎంచుకున్న మార్గం ఈ ఇద్దరి కామ్రేడ్స్‌ను ఎంతో ఎత్తుకు తీసుకెళ్ళింది. వీరి ఆశయాలు మహోన్నతమైనవి.

కా.సాగర్ తెలంగాణలోని వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామంలో 1985లో మునికంటి సుధాకర్ రెడ్డి, లత దంపతులకు మొదటి సంతానంగా జన్మించాడు. కా.సాగర్‌కు ఒక చెల్లె వుంది. తను పుట్టిన గ్రామంలోనే 10వ తరగతి వరకు చదువును పూర్తి చేసి, ఇంటర్మీడియెట్ ధర్మసాగర్‌లో చదివాడు. కానీ నిరుపేద కుటుంబం కావడంతో పై చదువులకు వెళ్లలేక పోయాడు. చదువును మధ్యలోనే వదిలి బ్రతుకుదెరువు కోసం ప్రైవేటు గ్రోమోర్ విత్తన కంపెనీలో చిరుద్యోగిగా చేరాడు.చాలీచాలని జీతంతో కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఇంటికి పెద్దవాడు కావడంతో కుటుంబ భారమంతా తనే మోసేవాడు.

పెద్దపెండ్యాల వర్గ పోరాటాల అనుభవం వున్న గ్రామం కావడంతో సహజంగానే చిన్నతనం నుండి తనకు విప్లవ రాజకీయాలు అలవడ్డాయి. తెలంగాణ రాష్ట్ర కోసం సాధన మలిదశ ఉద్యమం సాగుతున్న సమయంలో ప్రజాస్వామిక తెలంగాణ కోసం



పోరు చేశాడు. ఈ ఉద్యమాలతో విప్లవ రాజకీయాల ప్రభావం పెరుగుతుండడంతో వాటి నుండి మరింత స్ఫూర్తిని పొందాడు. పీడిత ప్రజల కోసం పని చేయాలనే పట్టుదలను పెంచుకొన్నాడు. సాయుధ పోరాటం ద్వారానే ప్రజాస్వామిక తెలంగాణ సాధ్యమని గ్రహించి, 2010లో దళంలో చేరాడు. దళ జీవితంలో తన శరీరం సహకరించక పోవడంతో కొద్ది కాలానికే సరెండర్ అయ్యాడు. కాని విప్లవ రాజకీయాలను మాత్రం వదలలేదు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం సాగుతున్న ఉద్యమంలో చురుకుగా క్రియాశీలకంగా పాల్గొన్నాడు. ప్రజా సంఘాలలో పని చేస్తూ అనేక పోరాటాలలో పాల్గొన్నాడు. గ్రామంలో పెత్తందార్లకు, భూస్వాములకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడాడు. దీనితో దోపిడీ వర్గాలు కక్షగట్టి పోలీసులతో రౌడీషీటర్లతో కా.సాగర్‌ను బెదిరించడం, వేధించడం మొదలు పెట్టారు. అయినా అధైర్య పడలేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దొరల పెత్తనం పెరిగింది. పోలీసుల వేధింపులు మునుపటి కంటే ఎక్కువ అయ్యాయి. రైతుల సమస్యలు రోజురోజుకు పెరిగిపోవటం, రైతుల ఆత్మహత్యలను చూశాడు. చేనేత, బీడి, సంఘటిత, అసంఘటిత కార్మికుల దిగజారిపోతున్న జీవితాలను చూశాడు. దళితులు, ఆదివాసులు, మహిళలు ఒక్కరేమిటి అన్ని సెక్షన్ల ప్రజల దుర్భర పరిస్థితులను చూశాడు. సామ్రాజ్యవాదులకు, పెట్టుబడిదారులకు దేశాన్ని, రాష్ట్రాన్ని కారుచౌకగా అమ్ముతున్న పాలకుల దుర్మార్గాలను చూశాడు. రాజ్యం అండతో పల్లెలపై మళ్ళీ విషపు కోరలతో ఎగబడుతున్న భూస్వాములను చూశాడు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలుసుకొని చలించిపోయాడు. ప్రజలకు ప్రజాస్వామ్యం దక్కాలంటే నూతన సమాజం అవసరమని గుర్తించాడు. సాయుధ పోరాట మార్గమే సరైందని భావించాడు. ఒకసారి సరెండర్ అయి జీవితంలో ఒక పెద్ద తప్పు చేశానని ఆత్మ పరిశీలన చేసుకున్నాడు. దేశంలో, రాష్ట్రంలో పదునెక్కుతున్న విప్లవ రాజకీయాలతో మానసిక దృఢత్వాన్ని పెంచుకున్నాడు. మరోసారి ఇలాంటి తప్పు జీవితంలో చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

జూన్, 2015లో సాగర్ పేరుతో మళ్ళీ దళ జీవితాన్ని ఆరంభించాడు. పార్టీ నిర్ణయం మేరకు ఇల్లందు-నర్సంపేట దళంలో సభ్యుడుగా వున్నాడు. కా.సాగర్ దళంలో డాక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాడు. తను కొత్తవాడైనా దళం దైనందిన కార్యక్రమాలైన వంట,సెంట్రీ, బరువులు మోయడం వంటి పనులను చురుకుగా, చొరవతో చేసేవాడు. దళంలో అనతికాలంలోనే అందరి మన్ననలు పొందగలిగాడంటే, అతనిది ఎంతటి మృదు స్వభావమో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా అతనిలోని అంకిత భావం, పట్టుదల, క్రమశిక్షణ కష్టపడేతత్వం కా.సాగర్‌ని అందరికి దగ్గర చేసింది. ప్రజలను కలువాలన్నా, విప్లవ గీతలు పాడాలన్నా చాలా ఉత్సాహపడేవాడు. మైదాన ప్రజలను కలువడానికి ఏటూర్‌నాగరం-మహదేవపూర్ దళంలో వుండగా ప్రజలను కలుస్తున్న సమయంలో సమాచారం తెలుసుకున్న పోలీసులు గ్రేహౌండ్స్ బలగాలతో అడవులను చుట్టుముట్టారు. దళం వున్న ప్రాంతాన్ని చుట్టుముట్టి సెప్టెంబర్ 15,2015న ఉదయం ప్రయాణిస్తున్న దళంపై గ్రేహౌండ్స్ పోలీసులు ఏకపక్షంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో కా.మహిత, కా.సాగర్‌లను ప్రాణాలతో పట్టుకొని చిత్రహింసలు పెట్టి శరీరాలను ఛిద్రం చేసి, యాసిడ్‌ను పోసి, మర్మాంగాలను కోసి కౄరంగా హత్య చేశారు. సమాజాన్ని నమ్మించడానికి ఇది ఎన్‌కౌంటరని బుకాయించారు. కాని హతుల ఛిద్రమైన శరీరాలను చూసిన ప్రజల హృదయాలు కదిలిపోయాయి. ప్రజలు, 371 ప్రజా సంఘాలు, 10 వామపక్ష పార్టీలు ఒకే వేదికపైకి వచ్చాయి. ఇది ముమ్మాటికి బూటకపు ఎన్‌కౌంటరేనని పాలకులకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. దీనిపై న్యాయ విచారణ జరిపి ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని చలో అసెంబ్లీ చేపట్టారు. కోర్టు వరకు ఈడ్చారు. కాని దోపిడీ పాలక వర్గాలు ప్రజల డిమాండ్లను ఏవీ పట్టించుకోలేదు. పైగా న్యాయం కోసం పోరాడుతున్న ప్రజలపై అణచివేతకు దిగింది. అరెస్టులు చేసింది. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అందరు గృహ నిర్బంధం, అణచివేత,లాఠీ చార్జీలకు గురయ్యారు.

కా.సాగర్, కా.మహితల మరణం పార్టీకి, ప్రజలకు తీరని నష్టాన్నీ, దుఃఖాన్నీ మిగిల్చింది. ఈ కామ్రేడ్స్ మన ముందు వుంచిన ఆశయాలను మన భుజాలపై వేసుకొని చివరి వరకు తీసుకెళ్ళడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి. కా.సాగర్ విప్లవ జీవితం, అంకిత భావం, పట్టుదల, కష్టపడేతత్వం మనకు ఆదర్శం.

కా.సాగర్ అమర్ హై.

## చూడ చక్కని మహిత విప్లవపు నెత్తుటి కవిత

- విముక్తి

పాలలాంటి తెల్లని మనస్సు
రమాదేవి నీకు ధారపోసే
ఆశయాల రాసులు నీకు
అసాంతం సుదర్శనమై అందించే
అడుగుడగున పేదల అంచున
ప్రమాదవీణపై ఆలుపెరుగని
ప్రయాణమై
పుట్టి పెరిగిన ఊరు
పోరాటాల గడ్డ జనహోరు
ఓరుగల్లు ఓడిలో యుద్ధతంత్రమే నేర్చినావు
తాడ్వాయి అడవి సిగలో ఎర్రకలువై పూసినావు
పల్లె ప్రజల కనుల జంట–కనుపాపలు నీకై చేసెనంట
అడవమ్మ ఒడినొదిలి–వెన్నెలోలే ఎదనవాలి
చీకటి గుడిసేలో బ్రతుకై వెలిగిన
అధర్మ కాలనాగు కాటువేసినా
చివరి రక్తపుబొట్టు చిరునవ్వులొలికింది
చిరుగాలిలా విప్లవ 'శృతి'గానమైంది
గోదావరి గంగమ్మ 'మహిత'కై వానజల్లులా
అడవి బిడ్డ అరచేతిలో అడవమ్మ పండైనట్టు
జనముకై జనక్రాంతి యుద్ధ రంగమునందొరిగే
తనువు పోరాటం ఒకటేనని
అంకురించిన చిట్టి ఆశయాలతో

రణమునందు రణబాటసారై
 పోరుగాలి అంపశయ్యపై ఆయుధమెత్తి
అసువులుబాసి
బతుకునిచ్చే మెతుకునిచ్చే బతకనిచ్చే పోరు బతుకమ్మవైనవు
బంగారు తెలంగాణంటూ భజనచేసే రాజ్యం
వంచనచేసే మోసకారి పాలకబుద్ధిని
మట్టికరిపించి తలలపై తాండవమాడేరోజు
రానేవస్తుంది ఎన్నటికైనా
పేద ప్రజల కలలపండుగ
ఆగిపోదు అమరవీరుల బాట
సమత మమతకై సాగిన వీరుల కలలకోట
అమరత్వపు శిఖరంపై 'శృతి'జ్యోతులను
ఆరనీక మరిచిపోక సాగిద్దాం సాయుధ బాట

# విప్లవ వనంలో వికసించిన విద్యార్థి మందారం

- సృజన

నేలరాలిన ఎర్రని సింధూరమా
వడ్డెపల్లెకు వన్నెతెచ్చిన యువ కిశోరమా
రాలిపోయిన తంగేటి పుష్పమా
ఎరువాక తొలకరి చేతికి చినుకులా
గోదారిమీద సాగిపోయే నావలా
కమ్ముకున్న మబ్బులను చీల్చేటి మెరుపులా
లక్షగొంతులు ఒక్కటై గర్జించే అరుపులా
నీ అడుగు జన తెలంగాణకై
నీ దారి ప్రజాస్వామిక విప్లవానికై
జన జాతరైంది నీ అడుగులవెంట
వాగువంకల్లో నీటి పరుగులా
పాలమీది మీగడలా
పచ్చని అడవిమీద పండు వెన్నెలవై
పరిమళించావు
వీపున గన్ను-చేతిలో పెన్ను
ఆదివాసులకు దన్ను- పీడిత ప్రజల మిన్ను
ఉడికే రక్తం-మార్పు కోరే నయనం
అడుగు సంద్రమై-బ్రతుకు జన సంద్రమై
ఎండు డొక్కల వెన్నుపూసలకు-మల్లెతీగవై అల్లుకున్నవు
రేపటి యువతరానికి నిచ్చెనై-నింగికి చేతుల్ని అందించిన
నూతన శ్రామిక విప్లవభానువై-తూర్పున ఉదయమై
వనరులను దోపిడీ దారుల దోసిళ్ళల్లో-ఆదివాసులను కన్నీళ్ళల్లో

బహుళజాతి రాబందుల రెక్కలకింద
తెలుగు నెలంతా స్మశానమవుతుంటే
కష్ట జీవుల రాజ్యంలో పేదల
చెమట కారి చెరువులై
రక్తం కారి పారే ఏరులవుతుంటే
గడిసిన చరిత నెరిగి-బిగిసిన పిడికిలై
చీకటి గర్భాన్ని చిల్చుకొనచ్చిన వర్గ చైతన్యానివై
ట్రిగ్గర్‌పై నీ చూపుడువేలుతో
యుద్ధ రంగాన్ని ముద్దాడి
శత్రువు వెంటాడుతుంటే
ఎంగిలాకులొద్దని-లొంగేది లేదని
ఆసిడ్ మంటల్లో మాగుతున్న-గుండె గంటై మోగుతున్న
రక్తసిక్త రాజ్యంతో రాజీపడక
ఏడు రంగుల సింగిడిలో ఎర్రజెండై వెలిసినావు
నీ చూపులు చీకటిలో కాంతి కిరణాలై
నీ పలుకులు శబ్దిస్తున్న చిరకాల నినాదాలై
నీ ఆశయాల పంట రాసులెత్తుకొని
విప్లవాల పోరు విత్తనాలేస్తం
శృతి నీకివే మా విప్లవ జోహార్లు

## బయోనెట్ అంచున నిలబడి యుద్ధం మధ్యన గర్జన

- విముక్తి

'విరిగిన లాఠీ'
కమిలిన గాయం
కాలిన తనువు
ధ్వంసమైన బతుక్కి
సాక్షి తెలంగాణ విద్యార్థి
ప్రతి విద్యార్థి-ఒక పోరు సంగమం
సకల జన సమరం
పెదవుల చివరి శుష్కనినాదం కాదు
చిందిన రక్తంలో ప్రతిఫలించిన ఐక్యత
మా అలుపెరుగని
అరవై ఏండ్ల స్వప్నం
భౌగోళిక తెలంగాణ కాదు
గత త్యాగాల చరితనెరిగినా
బిగించిన స్వప్నాల పిడికిలినడిగినా
తెలంగాణ గడ్డమీద
పారిన వీరుల నెత్తుటి చుక్కలనడిగినా
గర్జించి, ఘోషిస్తుంది.
'ప్రజాస్వామిక తెలంగాణ' ని
అన్నదాతల ఆకలి చావులు
ముసలవ్వల అసరా కేకలు
చేనేతల కండెలు ఉరితాళ్ళవుతుంటే
ఆడపిల్లను అంగడి బొమ్మగా మారుస్తుంటే

ఆదివాసుల అరణ్యఘోష
నిరుద్యోగుల జీవన అభిలాష
ప్రజాస్వామిక హక్కులు అవిటివై
సమస్త వృత్తుల–సహస్ర శక్తుల
వెతలనెరిగి
సాయుధ పోరాటం చేబూని
సనాతన సౌధాల్ని సమాధి చేయ
మీ విద్యలన్ని పేదలకు అంకితమిచ్చి
బయోనెట్ అంచున నిలబడి
యుద్ధం మధ్యలో
దీర్ఘకాలిక ప్రజాయుద్ధ నినాదమై
గర్జిస్తూ
తెలంగాణలోని పల్లెపల్లెనా
ఎండపొడకు మెరుస్తున్న స్థూపాల సూర్యులైన
విద్యార్థి వీరులు
వివేక్, శృతి, సాగరులు

# విప్లవానికి అంకితమైన సూర్య చంద్రులు

- సృజన

లేత కిరణాల పొరల్లోంచి
ఉబికి వస్తున్న అలివ్‌గ్రీన్ రంగుల
యువకెరటాల్లో ప్రజాయుద్ధ గీతమై
వికసించే ఎరుపు రేణువైన శృతి
అప్పుడే సూర్య కిరణాలపై
అరుణాన్ని ఎదలపై కప్పుకుంది
పోరుగల్లు వారసత్వాన్ని అందుకుని
అమరుల నెత్తుటి
నేలల్లో విలువిద్యల్ని నేర్చినా
కరదీపికవలె పుంజుకుంటూ
విప్లవ వెలుగుల్ని తోటి మిత్రులకు
పంచుతూ దళానికి గురువైంది
వేగు చుక్కల్లో 'చైతన్య మహిళ' సంఘమై
సమాజానికి అంటుకున్న ఆర్తనాదాలు అంతం కావాలనే
ప్రతి ఒక్కరు రణితలవలె గర్జిస్తూ
హింసకు-ప్రతిహింసకు సిద్ధమయ్యేలా
సాయుధ సైనికురాలివై
తాడ్వాయి అడవుల్లో సివంగివైతివి
ప్రజా ఆశయంలో నీ చిరు శృతి ప్రాయమూ
రాక్షస భక్షుటుల రాజ్యంలోనే
నీలాంటి నవ యువతలెందరో
ఈ మారణహోమాల్ని నిలువరించేందుకు

సైనిక కవాతులై కదిలి వస్తారు
కాలాన్ని పసిగట్టిన సూర్య చంద్రులు
జన సమూహంలో వాళ్ళొక విప్లవ రేఖలై
సబ్బండ వర్గాల సముద్రాల సాగరహోరు ఏకమై
నా తెలంగాణ నాక్కావాలె అనే ఓ బాధుతుని నినాదమై
ఆ పిడికిలి కొలిమిలోంచి రాలిపడ్డ ఆణిముత్యాలు
వివేక్, శృతి, సాగర్లు
పోరాడిన జన కెరటాలు
పోరు విద్యల్ని నేర్చిన వెలుగుదివ్వెలై
నూతన ప్రజాస్వామిక విప్లవానికి పోరు వారసులైనారు.

# పోరు శంఖారావం

- సృజన

ఆకలి కేకల అంతం కోసమే ఆయుధమెత్తారు వాళ్ళు
న్యాయం కోసం-నడిచారు నలుగురి బాట
తెలంగాణ నెత్తుటి గాయాల నుంచి రాలిన
నెత్తుటి చుక్కలు రగిలించాయి రణ నినాదాలు
బానిస సంకెళ్ళు తెగిపోతూ
ఆనందభాష్పాల్ని వర్షించే రోజులకై
శ్రామికుల పక్షాన లక్షోపలక్షల గొంతులెగిసాయి
ఆత్యాచార బాధితురాలు ములుగుతూ ప్రశ్నించింది? ఇలా!
మానవ ధర్మాలు మాడిమసైపోయా?
ఈ రాక్షస భటుల రాజ్యానికి అంతమెప్పుడు?
వీరులు మరణిస్తునే-ప్రజా పోరాటాలకు పురుడు పోస్తారు
ఈ మానస పుత్రుల తల్లివేరుల్ని పాతిపెట్టేందుకే
గగన సీమల్లో శృతిగానాలు చరమగీతం అందుకున్నాయి
కాల సర్పాలు కాటువేసిన-జనకేతనమై 'చలో అసెంబ్లీ'
పోరు శంఖారావం
వారు మృత్యుంజయులు అందుకే ఎర్ర జెండాని
ఎదలపై కప్పుకున్న తంగెళ్ళ శృతి సాగరహోరులు

# తొలివేగు చుక్కలతో మీ అడుగులు

- మాసే

తొలివేగు చుక్కలతో ముడి వేసుకున్న
జీవన రాగల నా ప్రియమిత్రులు శృతి సాగరులు
పోరు జ్వాల కలిసిపోయి
మల్లెతీగల బంధంగా మార్చింది
నూతన తెలంగాణ ఉద్యమాన్ని
పునర్నిర్మాణానికి పాదులై మీరు వస్తారు
సూర్యుడు నిప్పులు చెరుగుతున్నట్లు అట్లా
వీరకిశోరాలు పోరాడి ప్రాణత్యాగమే
చేసిన ఆకాశం వసంతకాల మేఘ గర్జన
అడవిలోనికి వచ్చిన కౄరమైన మానవ మృగాలు
పచ్చని పక్షుల అరుపులు
వినబడుతుందీ కొండలో కొనల్లో కొకిలమ్మ నేస్తం
నీటి బిందెలైనారు
గెరిల్లా ప్రయాణంలో గ్రెహౌండ్స్
పోలీసులు మాటుకాసి వున్న దొంగదెబ్బ తీశారు.
కామ్రేడ్స్ మహిత సాగరులు ఎర్రపూల వనంలో
మొలకలై వస్తారు

# ఆకాశంలో అరుణతారలై రేపటి వేగుచుక్కలై

**- దేవాళ్**

విద్యార్థులకు దిక్సూచిలైనారు
కాకతీయులను తరిమికొట్టిన వీర వనితలు
సారక్క-సమ్మక్కల పోరు వారసత్వంగా పేరొందిన
ఓరుగల్లు త్యాగాలకు పెట్టిన పేరు ఈ పల్లెలు
ఆ పల్లెల్లో జన్మించిన విద్యార్థులు మీరు
బూర్జువా చదువులను తరిమివేస్తూ
ప్రజల బతుకులు చదివినారు
ప్రజా సమస్యల పరిష్కార మార్గం ఆయుధమే అన్నారు.
ఆ పచ్చని అడవిలో మీ ప్రయాణంలో
రక్తం రుచి మరిగిన వేట కుక్కల వలలో పడ్డారు
మిమ్ముల్ని పట్టుకుని చిత్రహింసలు పెడుతూ వుంటే
మీ అరుపులు విన్న చుట్టూ వచ్చిన ఆ మూగ జీవులు
కొట్టవద్దు అంటూ కూసింది కోకిల
చంపవద్దు అంటూ మొత్తుకున్నది ఆ నెమలి తల్లి
మా అన్నలను ఎంచేయొద్దు అంటూ
ఆ తీగలు, చెట్ల కొమ్మలు పుట్టుకొచ్చాయి
ఇక నా బిడ్డలు లేరని కూలబడ్డ ఆ అడవి తల్లి
పారే రక్తాన్ని చూసి ఏక్కి ఎక్కి ఏడ్చింది లేడిపిల్లా
ఆ భూతల్లి ఒడిలో చేర్చుకుంది మిమ్ముల్ని
మీ మరణ వార్త విని రణ రంగానికి సిద్ధమైంది
విద్యార్థిలోకం రాబందుల రాజ్యాన్ని కూల్చడానికి
సాయుధమై కదిలిన సాగరుడివై

శత్రువు గుండెల్లో తూటావై గర్జించిన శృతివై
దోపిడీ లేని నవ సమాజ స్థాపనకై
చిందించిన మీ నులివెచ్చని రక్తం
ఆ రక్తంతో ఎరుపు ఎక్కిన ఎర్ర జెండాలో
మీ రూపం చూసుకుంటాం.

## కా. మహిత(శృతి) స్మృతిలో

**- అరుణ్**

పొద్దుగూకులు పొద్దుతో పోరాడిన
పొట్టగడవని పేదల చూసి
పట్టెడన్నానికై పడరానిపాట్లుపడే పసి పిల్లల చూసి
రక్షణ నిలయాలు రాక్షస నిలయాలై
రక్షక భటులు భక్షక భటులై
రజనీలను రాక్షసంగా హత్యచేస్తే
నిర్భయలు అభయం ఇవ్వవు అన్నావు
హైటెక్ చదువులు హైటెక్ సిటీలు హైటెక్ జీవితం ఉద్యోగం డబ్బు
పబ్బులు క్లబ్‌లు పార్టీలు అంటూ
రంగుల ప్రపంచంలో ముంచివేయ
పెట్టుబడిదారీ రంగుల మాయను
మార్క్స్ మైక్రోస్కోప్‌తో శోధించావు
ఉన్నోల్ల బతుకుల్లో విలాసాలేంటని
లేనోల్ల బతుకుల్లో ఆకలి చావులేంటని
మనిషి మనిషికీ తేడాలేంటని
పరిపరి విధాల ఆలోచించి
సారంలేని చదువులు
సమాజాన్ని మార్చలేవని
సమతారాజ్య స్థాపనకై సమరం చేయసాగిన 'శృతి'
కత్తుల వంతెనపై ప్రయాణం
అడుగు తడబడితే పోయేది ప్రాణమే
అయినా!

కష్ట జీవుల విముక్తికై
కత్తుల వంతెనపై కదనరంగమాడ కదిలిన మహిత
చిత్రహింసల్లో చిందిన రక్తం
చిరు కాలువలై జంపన్నవాగు హోరెత్తి
సముద్రాలై వరి పొలాలను తడిపింది
నీ రక్తంతో పదునెక్కిన వరి పొలాలు
పుట్లకొద్ది పంటలై వరి కర్రలు
బరిసెలై బలిసిన దొరల భరతం పట్ట
బరిగీసి నిలిచినాయి.

# ఉదయించిన ఉదయభాను

**- అరుణ్**

ఉద్యమాల ఉక్కుకోటలో
ఉదయించిన ఉదయభాను
చీకట్లను చీల్చి చెండాడుతూ
ఊరి పొలిమేర్లకు పయనమైంది
ఉదయభాను వుంటే ఊపిరాడక
ఊరి పొలిమేరల్లో రాహు(రాజ్యం)
మాటువేసి కాటువేయ పట్టివేసింది
ఆడపిల్లను రక్షించండి,ఆడపిల్లను చదివించండి
అంటూనే రహస్యాలు చెప్పమంటు
రాక్షసంగా చిత్రహింసలు పెట్టి
అంగాలు నరికి ఆత్యాచారం చేస్తూ ఆనందిస్తుంటే
తూ... ముఖంపై ఉమ్మి
ఆడపులై గర్జిస్తూ
నీవు విసిరిన ప్రశ్నల గుణపాలు
దోపిడీ గుండెల్ని గుచ్చుతుంటే
పిడికెడు మీసాల అధికారిని అంటూ
అహంభావంతో అరిస్తే
అంగాలు నరికిన ఆత్యాచారం చేసిన
ఆశయాన్ని అంగట్లో అమ్ముకోను
ఆశయాన్ని వీడననీ కన్నులతో నిప్పులు చెరిగితే
జీవశ్చవమై నీ ముందు నిలువలేక
నీ మనసును దోచుకోలేక నిన్ను హత్య చేసి

ఎన్‌కౌంటర్ అన్నాడు చెల్లి
నీ మరణం!
పాలక వర్గాలకు పండుగను ఇస్తే
నీ మరణం
పీడిత ప్రజలకు వర్గ కసిని పెంచింది.
అందుకే!
పాలకవర్గాలను పాతర వేయ పీడిత ప్రజలు ఏకమై కదులుతుండ్రు
ఎర్రదండులో
నీ ఆశయ సాధనలో కవాతు చేస్తుంది పి.ఎల్.జి.ఎ.

# సాయుధపోరాటమే పీడిత ప్రజల మార్గం

- మహేష్

విముక్తి పోరాటంలో ముందుండి నడిపించాలని
కలలు కన్న సాగరుడిని
యుద్ధభూమి ముద్దాడింది
ఎంతోమంది పోరాటయోధులు
తమ రక్తాన్ని ధారపోసి
విముక్తి కేతనాన్ని ఎత్తిపట్టిన నేలపై
జన్మించిన సాగరుడు జన సైనికుడైనాడు
జనం ముద్దు బిడ్డడయ్యాడు
సాయుధ పోరాటమే పీడిత ప్రజల మార్గమని
సంకల్పించాడు ప్రాణ త్యాగం చేశాడు
పోరు వీరులకు ఆదర్శమైనాడు
టి.ఆర్.ఎస్. పాలకుల ఎంగిలి మెతుకులకు
ఆశ పడిన పోలీస్ మూకలు
ప్రజా వీరుడు సాగర్‌ను హతమార్చి
పాలకులకు విముక్తి కలిగించామని
సంబరపడుతున్నాయి
ఆ వెర్రిమూకలకు ఏమి తెలుసు
ఆ సాగరుడే ఒక పోరాట సాగరమని
తెలంగాణ ప్రజల సమస్యలకు
సాగర్ అమరత్వ బాటనే ఏనాటికైనా
ఒక పరిష్కారం
సాగరుడు ఒరిగిపోయిన

ఆ పోరాట యుద్ధభూమి
పొరల నుండి మానవులు
ఎందరో వీర కిశోరాలకు జన్మిస్తారు
నీ అమరత్వం హక్కుల పోరాటాలకు
ఉద్యమించ దారులు చూపిన
వీరుడు సాగరు
తెలంగాణ పాలక వర్గాలు
ప్రజాస్వామిక హక్కులను ఖూనీ చేస్తున్నాయని
రుజువు చేసిన నీ త్యాగం
మొద్దుగుట్ట ఎన్‌కౌంటర్‌లోని
సాగర్ అమరత్వం ప్రజా కార్యకర్తల
కర్తవ్యాల సాధనకి మేలుకొలిపి రాజ్యంపై
గళమెత్తించిన నీ అమరత్వం
రాష్ట్రంలో ఓట్లతో సీట్లు గుంజి పబ్బం
గడుపుతున్న పాలకులు సైతం
ప్రతిపక్షాలు మీ ఎన్‌కౌంటర్
బూటకమని ఉద్యమించాయి.
సాగర్ హత్య పోలీసుల ఫాసిజానికి
ఒక నిదర్శనం
పీడిత ప్రజల విముక్తి కోసమే
ప్రాణాలర్పించిన సాగర్
త్యాగం ఈ సమాజనికి ఓ ఆదర్శం
ఒక చరిత్ర ప్రజాసైన్యంతోనే జరుగుతుందని
ఆశించి ఆయుధం పట్టిన వీరుడు మన సాగరుడు
సాగరా.. నీ త్యాగం ఎన్నటికీ వృథా కాదు
నీ ఆశయం మా అందరికీ ఆదర్శం
నీ విప్లవ పట్టుదల మాకు సిద్ధాంతమై
పట్టువీడక తుది వరకు పోరాడుతామని
శపథం చేస్తున్నాం!

## వెలిగే జ్ఞానంకై గుండె నెత్తురు

- విముక్తి

తర్పణం చేసిన ధీరుడు కా.సాగర్
తెలంగాణ దుక్కుల్లోంచి మొలిచిన
ఎర్రటి గోగుపూల వనంలోకి
'విద్య' కుసుమమై
విష సంస్కృతులపై వ్యతిరేక గళమై గర్జించి
కష్టజీవులను మేల్కొలిపిన జనక్రాంతి
దోపిడీ పాలనను అంతమొందించే డమరుకమై
నీ పాదం ప్రజాస్వామిక తెలంగాణకై
నీ నయనం నూతన ప్రజాస్వామిక విప్లవానికై
అరవై ఏండ్ల తెలంగాణ పురిటి నొప్పుల
ఫలితం
దోపిడీ పద ఘట్టనల కింద నలిగే
తెలంగాణ కాదు
చూపుడు వేలుతో
దోపిడీలేని జనతన రాజ్యాన్ని చూపిస్తూ
అరణ్య పూలతో మమేకమైన ఆదివాసుల
పోరాటాల్లో పొడిచే పొద్దువై
భారతమ్మ దాస్య శృంఖలాల విముక్తికి
పురుడు పోసుకున్న జనతన సర్కార్లను
గోదావరి అలల మీదుగా
తెలంగాణలో విస్తరించే వ్యూహానివై
జంపన్న సాయుధ పోరుకు

శంఖారావం పూరించిన
త్యాగాల మాగాణి
సమ్మక్క సారక్కల నెత్తురులతో
తడిసిన సంద్రమైన నేల
'వివేక్' చిందించిన నెత్తుర్లోంచి
ఎరుపు రంగు పూసుకొని
పోటెత్తిన విప్లవ జ్వాల
యువతరమంటే ఫేస్‌బుక్, వాట్సప్‌లలో
మెస్సేజ్ పోస్ట్ చేయడం కాదని
పేదల గోడును తెరదించే
సాయుధ పోరులో 'రాంజీ'
వారసులవ్వాలని వేలిగే జ్ఞానంకై
మొద్దుగుట్టలో రాలిన ముత్యాల 'సాగర'హారం
గుండె నెత్తురును తర్పణం
చేసిన నీ ఆచరణ
మాకు ఆదర్శం
నీవు కలలుగన్న
ప్రజాస్వామిక తెలంగాణలో
ఎర్రసైనికులమై కవాతు చేస్తాం

## విద్యార్థి ఉద్యమ ఉక్కుకోటల్లో ఉదయించిన యోధులు

**- అరుణ్**

పోరాటాల పురిటిలో
నిర్బంధపు లోగిల్లలలో అరవై ఏండ్ల నొప్పుల
కష్టాల కానుపులో తెలంగాణ కన్న బిడ్డలు
ఉద్యమాల ఉక్కుకోట తెలంగాణ
నాటి నైజాం పెత్తనాలను ప్రశ్నించి
కాకతీయులతో కయ్యమాడి
కష్టజీవుల విముక్తికై
పటేల్లను పరుగులు తీయించిన
నాటి పోరాట గాథలెన్నో చదివి
విద్యార్థి ఉద్యమ ఉక్కుకోటల నుండి
పేదోళ్ళ పోరాట విత్తనమై
పుట్టకొచ్చిన పోరు జ్వాలలు
'వివేక్, శృతి, సాగర్లు'
భూస్వామ్య దోపిడీ పాలక వర్గాల
పాద గట్టనల కింద
నలిగిపోయే భూమాత
నిలువ నీడలేక కూడు లేక
కష్ట జీవుల శ్రమ విముక్తి కోసం
భూమి, భుక్తి, విముక్తికై
సాగే సమరంలో
సాగిన సాహసిక యోధులు
సామ్రాజ్యవాద కార్పొరేట్ వ్యవస్థ

యువతను రంగుల ప్రపంచంలో ముంచితే
రాజకీయ దోపిడీ రంగును బయటపెట్ట
రణరంగంలో గర్జించిన వీరులు
ప్రజలే ప్రాణంగా ఉద్యమమే ఊపిరిగా
మట్టి మనుషులను ముద్దాడాలనే ఆరాటంతో
కష్టాలెన్ని వున్నా పట్టుదలతో పనులు చేస్తూ
పల్లె పల్లె తిరిగి సంఘటితం చేస్తుంటే
ఓర్వలేని రాజ్యం మాటేసి కాటేసింది
మిత్రులరా ధైర్యానికి,సాహసానికి
మీరు ప్రతీకలు.

# మొద్దుగుట్ట అమరుల పాట

- సవిత

పొడిచేటి పొద్దును కమ్మేసెనమ్మా ఆకారు మేఘం
లేలేత కిరణాల కాటేసేనమ్మో కసయి రాజ్యం
మహితక్క, సాగర్ మనతొలి పొద్దో తెలుగింటి వెలుగు
ఉదయించే పొద్దుకు ఎరుపయినారో తమనెతురద్ది
చిత్రహింసల్లోన నలిగిపోయారో మా బిడ్డలమ్మ
మొద్దుగుట్ట వద్ద ముద్దాడినారో ఆ యుద్ధభూమి "పొడిచేటి"

విప్లవ తోటలో విరబూసినాదో తంగెళ్ళ శృతి
తంగెళ్ళ ఇంటిలో తనువంత ఎరుపై విప్లవించిందో
వడ్డెపల్లి బిడ్డ ఉద్యమపంటో ఉద్యోగి ఇంటా
బీదోళ్ళ ఇంటిలో బంధువయిందో భాగమయింది "పొడిచేటి"

ఆరేటి (బతుకులను కండ్ల చూసిందో కదలాలి అంది
ఆడాళ్ళు అరటాకు కానేకాదందో సబలలనంది
మనుధర్మ సూత్రాల పాతరెయ్యందో పోరాడమంది
మహిళా సంఘంలోన చేరాలి అందో చేయూతనంది "పొడిచేటి"

తెలంగాణ పోరులో పిడికిలెళ్ళెత్తిందో ఊపిరూదింది
ప్రజలకే అధికారం దక్కాల అందో దండుకెళ్ళింది
హైటెక్కు చదువుల ఎంటెక్ నొదిలి బందూకయ్యిందో
బలిసిన దొరలకు బారుబెట్టిందో బాకునేనంది "పొడిచేటి"

పెద్ద పెండ్యాలలో పేదింటి బిడ్డో మన విద్యాసాగర్
మట్టితల్లి కన్న మాణిక్యమ్మో మనికంటి సాగర్
పేదోళ్ళ బ్రతుకుల్లో పెనవేసుకుండే ప్రాణమయిండో
ఆదివాసుల చేతి విల్కాడు అయి అభయమిచ్చిండో "పొడిచేటి"

రాష్ట్ర సాధనలోన నడుము కట్టిండో నడవమన్నాడు
సమధర్మమే ప్రజాస్వామ్యమన్నాడో సాగిపోయిండు
భూస్వామ్య దొరగాల్ల పందెమాడిండో పరుగు బెట్టించ
రగిలి పోతువాడు రైఫిలెత్తిండో రాడికల్ బిడ్డా "పొడిచేటి"

కష్ట జీవుల చెంత చేరిపోయిండో యుద్ధరంగాన
జంగ్‌లో జనమును కలువమన్నాడో జయమునదండు
యుద్ధంలో వీరుడు నేలకొరిగిండో నెత్తురిచ్చిండు
జయకేతనమయి నింగి కెగిసిండో సెల్యూట్ చేస్తూ "పొడిచేటి"

ఓరుగల్లు ఒడి పోరుబిడ్డాలో ఈ వీరులమ్మ
విముక్తి పోరుకు పొలికేకలమ్మ పోరు గీతాలు
కాటేయ మాటేసి మిమ్ము పట్టాయో ఖాకీ మృగాలు
యాసిడును పోసి హత్య చేసిండో ఎన్‌కౌంటరందు
నాటి నిజాంను తలదన్నినోడో తనయుడయిండు
కాలకూట విష సర్పమయిండో ఈ కె.సి.ఆర్. "పొడిచేటి"

మీ హత్యవిన్న జనం ఎత్తుకొన్నారో పోరు నినాదం
ఆశయాల పల్లకందుకున్నారో పోరు జనమంత
పిల్లలు పెద్దలు జగమంతనేడు పోరు కెరటాలై
సంఘమంత కలిసి సంద్రమైందో ఉప్పొంగే చూడు "పొడుచేటి"

## పుడమిలో పూసిన పువ్వులు చీకటి చీల్చే చిరు దీపాలు

## కా.శృతి, కా.సాగర్

